ఏమీ తెలియదు అనుకోవద్దు. ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన దగ్గర కూర్చొంటే మన జీవితాలు అన్నీ తెరవబడిన పుస్తకాలు వంటివి. మన గురించి మనకంటే గురువుకు ఎక్కువ తెలుసు, అది మర్చిపోకూడదు. మనలో ఫలానా వాసన ఉంది అని నోటితో చెప్పడు. ఆ వాసన ఉందని మనకు తెలియజేసి, దానిని ఇష్టంగా అనుభవించేలాగ చేసి దానిని బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు, వాడు గురువు. గురువు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు. నీవు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. బంధువులు స్నేహితులు నిన్ను విడిచిపెట్టేస్తారు గాని గురువు నిన్ను విడిచిపెట్టడు. నీకు బ్రహ్మానుభవం కలుగకుండా ఏ బలహీనతలు అయితే ఆటంకాలుగా ఉన్నాయో చూసుకొని ఆ బలహీనతలను అన్నీ ఒక్కసారి తియ్యడు, నువ్వు తట్టుకోవాలి కదా. ఒకదాని తరువాత ఒకటి బయటకు లాగి ఆ బలహీనతలన్నింటినీ కాల్చి బూడిద చేసి నువ్వు ఏదిగా ఉన్నావో అందులో నిన్ను ఐక్యం చేసేవరకూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు, వేటాడుతూ ఉంటాడు. వేటగాడు జంతువును ఎలా వేటాడుతూ ఉంటాడో నీకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ అలాగ గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వేటాడటం అంటే నీ అజ్ఞానాన్ని వేటాడతాడు, అది బయటకు పోకుండా నువ్వు బ్రాహ్మీస్థితిని పొందలేవు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-08-2007, తాడేపల్లిగూడెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రపంచం అనేది ఒక నాటకశాల. ఈ నాటకశాలలో అనేకమంది అనేక పాత్రలు ధరిస్తారు. కొంతమంది రాజుపాత్ర, కొంతమంది మంత్రి పాత్ర, కొంతమంది నౌకరు పాత్ర ఇలా అనేకమంది అనేక పాత్రలు ధరిస్తారు. ఈ పాత్రలు అన్నీ అబద్దాలే. ఆ స్టేజిమీద ఉన్నంతసేపు ఆ పాత్రలు నిజం, స్టేజిమీద నుండి దిగిన తరువాత అది నిజం కాదు. మనకు అర్థమైనా, అర్థంకాకపోయినా అది అంతే. అయితే సహృదయం ఉన్న వారికి, పుణ్యబలం ఉన్న వారికి, సద్బుద్ధి ఉన్నవారికి ఈ సబ్జక్టు అర్థమవుతుంది. ఈ నాటకంలో ఎవరిపాత్ర వారు పోషిస్తారు. ఆ పాత్ర పోషించటం అయిపోయిన వెంటనే ఈ నాటకంలోనికి ఎవడైతే ఈ జీవుడిని పంపాడో ఆ ఈశ్వరుడే మరల వెనక్కి తీసేసుకొంటాడు. అయితే ఈ ఆట అంతా అబద్ధమే, ఇది అంతా భగవంతుడి యొక్క లీల. జయం, అపజయం అనేది మన చేతిలో లేదు. అది పూర్వజన్మ సుకృతాన్ని బట్టి, దైవనిర్ణయాన్ని బట్టి ఉంటుంది కాని కేవలం మన తెలివితేటల మీద ఆధారపడిలేదు. చదువు, సంపాదన ఇవి అన్నీ కూడా అంతే. జయం వచ్చినప్పుడు పొంగిపోవద్దు, అపజయం వచ్చినప్పుడు కుంగిపోవద్దు అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇవి రెండూ నిజం

కాదు. మనం ఒకోసారి చిరాగ్గా, ఒకోసారి కోపంగా, ఒకోసారి గర్వంగా ఇలారకరకాలుగా ఉంటాము. ఒకేరకంగా ఉన్న మూర్తి ఎవరు అంటే దక్షిణామూర్తి, ఆ మొఖంలో ఏ వికారాలు లేని మూర్తి దక్షిణామూర్తి. లోపల గుణాలు ఉన్నప్పడు మొఖంలో వికారాలు వస్తాయి. లోపల గుణాలు లేనప్పడు ఎప్పడూ ఒకే రకంగా ఉంటాము కాని వికారాలు ఉండవు. ఈ ప్రపంచం అంతా గుణాలతో నిండి ఉంది. ఒక కాలప్రవాహంలో శరీరం వచ్చింది, మరో కాలప్రవాహంలో శరీరం పోతుంది. సంపదలు అంతే. ఒక కాలంలో వస్తూ ఉంటాయి, ఇంకో కాలంలో వెళ్ళిపోతూ ఉంటాయి. ఇవన్నీ ఈశ్వరుని నిర్ణయాన్ని బట్టి జరుగుతూ ఉంటాయి. మనం చేయవలసింది ఏమిటి అంటే వాటితో తాదాత్మ్యం పొందకుండా పరమేశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉంటే ఆయన మాయలో నుండి మనం బయటకు వచ్చేస్తాము. ఈగలు ఎంతసేపు పుండును కోరుకుంటాయి, మంచి మనస్సు లేనివారు పేచీలు కోరుకొంటారు, మంచి మనస్సు ఉన్నవారు శాంతిని, ప్రేమను కోరుకొంటారు, ఏగూటి పక్షులు ఆ గూటికి నెమ్మదిగా చేరుకొంటాయి అని శాస్త్రంలో చెపుతారు. మనం చేసే పని కూడా ఈ శరీరం ద్వారా జరగవలసిన పనే జరుగుతుంది, ఈశ్వరుడు ఏ పని అయితే నిర్ణయించలేదో ఆ పని మనం ఎంత ప్రయత్నం చేసినా ఆపని జరుగదు. ధర్మం అంటే చాలామంది దానం అనుకొంటారు. ధర్మంలో వివేకం, వైరాగ్యం, మంచితనం, డ్యూటీ, ద్వేషం లేకుండా తోటి మానవులను ప్రేమించటం ఇవి అన్నీ వస్తాయి. ధర్మాన్ని స్థాపించటానికే ఈ సృష్టిలోనికి వస్తున్నాను, నాకు వ్యక్తిగతంగా ఇక్కడ పని ఏమీ లేదు అని భగవంతుడు చెప్పాడు. మీ విద్యుక్త ధర్మాలు మీరు చేస్తూ ఉండండి. పరమేశ్వరుడు మన దేహానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని ఓర్పుగా, నేర్పుగా, చిత్తశుద్ధితో, విసుగులేకుండా, ప్రేమగా చేస్తూ ఉంటే అది మనకు జ్ఞానానికి కారణమవుతుంది. వ్యక్తి భావన లేకుండా, రూపబుద్ధి నామబుద్ధి లేకుండా, గౌరవాలు ఆశించకుండా మనం పూజ ఎలా చేస్తామో అలాగ భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేస్తే దాని వలన మీకు జ్ఞానం కలుగుతుంది. ధ్యానం, జపం, తపస్సు చేయటం వలన ఏ ఫలితం వస్తుందో మంచి కర్మలను, మంచి మనస్సుతో చేయటం వలన అదే ఫలితం వస్తుంది.

అసలు లోపల, బయట అంటూ ఏమీ లేదు. లోపల ఒక దేవుడు, బయట ఒక దేవుడు లేడు. లోపల ఉన్నవాడే బయట ఉన్నాడు. బయట ఉన్నవాడే లోపల ఉన్నాడు. మనకు దేహము నేను అనే బుద్ధి ఉంది, దేహబుద్ధి కారణంగా మనకు లోపల, బయట అనే వేరుబుద్ధి వస్తోంది. మనం శాంతిగా ఉంటే లోకం అంతా శాంతిగా ఉంటుంది, మన మనస్సు నిర్మలమైతే, నిశ్చలమైతే, ఏకాగ్రమైతే మనలను తీసుకొనివెళ్ళి పెంట మీద కూర్చోబెట్టినా శాంతిగానే ఉంటాము. మన మనస్సు బాగాలేదు అనుకోండి, మనలను పది అంతస్థుల మేడమీద కూర్చోబెట్టినా

అశాంతేగాని మనకు శాంతి ఉండదు. డబ్బు వలన శాంతిరాదు, ప్రేమ వలన, భక్తి వలన, జ్ఞానం వలన మనకు శాంతి వస్తుంది. మనకు బాహ్యంగా ఎన్ని భోగాలు ఉన్నా మనకు శాంతి లేకపోతే సుఖం లేదు. పూర్వపుణ్యం వలన కొంతమంది చిన్నతనం నుండి భగవంతుడిని స్మరించుకొంటూ ఉంటారు. చిన్నతనంలోనే భక్తి, వైరాగ్యం, వివేకం కలగటం వలన వేరుబుద్ధి తగ్గుతూ ఉంటుంది, రాగద్వేషాలు తగ్గుతూ ఉంటాయి. మీరు వేరు, నేను వేరు అనుకోవటం వలన మిమ్మల్ని చూసి ద్వేషపడుతున్నాను. ఆ వేరుభావనలోనుండే భయం, కోపం, అసూయ, ద్వేషం, కోరిక అన్నీ వస్తున్నాయి. మనం అంతా ఒక్కటే ముద్ద అనుకొన్నప్పుడు ద్వేషం లేదు, కోరిక లేదు, కోపం లేదు. ఉన్నది ఒక్కటే రెండోది అంటూ ఏమీ లేదు, నీకు రెండోది కనిపిస్తూ ఉంటే అది మాయ. మాయ అంటే ఏమీ లేదు లేనిది ఉన్నదాని వలె కనిపిస్తూ ఉంటుంది, లోకం కూడా అంతే. భగవంతుడు ఒక్కడే, అనేక రూపాలలో అనేక పనులు చేస్తూ ఉంటాడు. అందుచేతనే గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఎవరు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా నన్నే పొందుతారు, అంటే బ్రహ్మమునే పొందుతారు అని చెప్పాడు. మనకు ఒక రూపం, పేరు ఉంది కాబట్టి అవతారాలలో ఏదొక రూపాన్ని ధ్యానిస్తూ, నామాన్ని స్మరిస్తూ మన రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలో నుండి బయటకు రావటానికి జపధ్యానములు ఏర్పాటు చేసారు. మన మనస్సును మనం బాగుచేసుకోవాలి. మనం మనస్సును బాగుచేసుకొంటే, రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకొంటే ఈ శరీరంలో ఉండగానే మోక్ష సుఖాన్ని పొందవచ్చు. వైకుంఠంలో ఏమి ఉందో అది ఇక్కడ కూడా ఉంది. అయితే మనకు వ్యక్తిభావన పోతే ఆ ఉన్నదేదో మనకు తెలుస్తుంది. అది భక్తివలన, ఉపాసన వలన, జ్ఞానం వలన సాధ్యం. శరీరం చనిపోయినప్పుడు మన కూడా ఎవరూ రారు, మనకు ఉన్న రాగద్వేషాలు మన కూడా వస్తాయి. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఎవడైతే బుద్ధిమంతుడో వాడు నేను పాపాలు చేసాను అనుకోడు, పుణ్యాలు చేసాను అనుకోడు, శరీరాన్ని ఎలావిడిచిపెట్టి వెళ్ళిపోతాడో అలాగ వాడు చేసిన పుణ్యపాపాలను కూడా ఇక్కడ విడిచి పెట్టి వెళ్ళిపోతాడు, ఇంక వాడికి ప్రయాణాలతో పనిలేదు. మనం ఏదైనా చిన్న మంచి పని చేస్తే పుణ్యం కోరుకొంటాము. పుణ్యం వస్తుంది అని చెపితేనేగాని చాలామంది ఆ మంచి పని కూడా చెయ్యరు, అదే వ్యక్తిభావన.

మనకు వచ్చే ఆలోచనలు, మనం చేసే పనులు భగవంతుడి దయకు అనుకూలంగా ఉండాలి. భగవంతుడి అనుగ్రహానికి మించినది ఏమీ లేదు, భగవంతుడి అనుగ్రహానికి అసాధ్య మంటూ ఏమీ లేదు, ఆయన అనుగ్రహం సంపాదించటానికి మాత్రమే మనం పని చేస్తూ ఉంటే జీవన్ముక్తస్థితిని పొందవచ్చు. సృష్టిలో అనేక రకాలవాళ్ళు ఉంటారు. మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు మంచి వారు దేవుని సృష్టే, చెడ్డవారు దేవుని సృష్టే. వీళ్ళు

మంచివారు అని అనురాగం పెట్టుకోవద్దు, వీళ్ళు చెడ్డవారు అని ద్వేషం పెట్టుకోవద్దు, ఆయన సృష్టించాడు మనకు ఆ గొడవ ఎందుకు? మనం ఉదాసీనంగా ఉండి మన పని మనం చేసుకొని వెళ్ళిపోవాలి. నీలోపల అంతర్యామిగా నారాయణుడు ఉన్నాడు. నువ్వు అన్ని విధాలుగా ప్రయత్నం చేసి వాడి అనుగ్రహాన్ని సంపాదిస్తే నువ్వు ఇక్కడే తరిస్తావు అని పరమాత్మ చెపుతున్నాడు. మనకు భగవంతుడు ఉన్నాడని విశ్వాసం లేదు, ఆయన మాట మీద నమ్మకం లేదు అందుచేత మనం పాడైపోతున్నాము. అభిమన్యుడు యుద్ధంలో చనిపోయాడు. అర్జునుడికి కుమారుడిమీద మమకారం పోలేదు. కృష్ణుడు నోటి మాటలతో చెప్పినా అర్జునుడికి అశాంతి పోలేదు. అప్పుడు ప్రాక్టికల్‌గా చనిపోయిన కుమారుడిని చూపించాడు. అర్జునుడు కుమారుడిని పలకరించాడు. నీకు నాకు సంబంధం ఏమిటి అని వాడు అన్నాడు. శరీరం ఉన్నప్పుడు తండ్రీ, కొడుకు ఆదేహం లేనప్పుడు బంధుత్వం ఏమిటి? అప్పుడు అర్జునుడికి మోహం పోయింది. మన శరీరం చని పోయిన తరువాత ఆ కుటుంబంతో సంబంధం తెగిపోతుంది. భర్త ఎవరో, భార్య ఎవరో ఇవి అన్నీ దేహసంబంధాలు. దేహం ఉంటే కుటుంబం గాని దేహం లేనివాడికి కుటుంబం ఏమిటి? నేను అనే తలంపు ఉన్న వాడికి మనస్సు, మనస్సు ఉన్నవాడికి దేహం, దేహం ఉన్నవాడికి లోకం. అసలు నేను అనే తలంపు లేనప్పుడు వాడికి లోకం ఎక్కడ ఉంది అన్నారు భగవాన్.

భగవంతుడిని పొందటానికి అనేక మతాలలో అనేక మార్గాలు ఉన్నాయి. మనకు ఏ మార్గం ఇష్టమైతే ఆ మార్గంలో ప్రయాణించి ఆయనను పొందవచ్చు. మనం నేను, నాది అంటాము. ఆ వస్తువు నాది అనుకొంటే అదిపోతే దానికోసం పరుగెడతాము. అది నాది కాదు అని తెలిసింది అనుకోండి. ఆ వస్తువు పోయిన ఏ గొడవ ఉండదు. మనం చనిపోయేదాక చేసే పని ఏమిటి అంటే నాది కూడా పరుగెడుతున్నాము. నాది లేకపోతే ఇంక పరుగులు అక్కరలేదు. నేనులో నుండే నాది వస్తోంది. నేను లేకపోతే నాది లేదు. భక్తి మార్గంలో చెప్పేది ఏమిటి అంటే నేను అనే తలంపును తీసుకొనివెళ్ళి భగవంతుడి పాదాలకు అర్పిస్తే ఆ నేను పోయినప్పుడు ఇంక నాది కూడా ఉండదు. ఇంక నీవు శవాలను మోయనక్కరలేదు. నాకు పత్రం ఇవ్వండి, పుష్పం ఇవ్వండి, తోయం ఇవ్వండి అని కృష్ణుడు అంటాడు. అలాగే ఎప్పడైనా ఈ నేనును కూడా ఆయనకు నైవేద్యం పెడతాము అని మనకు ఇవ్వటం అలవాటు చేస్తున్నాడు. మనం ఇంటి ప్రక్కవారు చనిపోతే మనకు ఏమీ అనిపించదు. ఎక్కడో ఢిల్లీలో మీ మనవడు చనిపోతే ఇక్కడ నుండే ఏడ్చేస్తారు, దీనికి నాది కారణం. అంటే మనం దేహం చుట్టూ తిరుగుతున్నాము. వాడు పండితుడైనా పామరుడైనా వాడికి ధనం ఉన్నా లేకపోయినా, అధికారం ఉన్నా లేకపోయినా జీవితంలో ప్రతీ మనిషి ఈ నేను

చుట్టూ, నాది చుట్టూ తిరుగుతూ ఉంటాడు. అంతకంటే ఏమీ లేదు. దారుకావనంలో ఋషులు కర్మకాండలు చేస్తారు, యజ్ఞాలు, యాగాలు చేస్తారు. కాని కర్మకు కర్మఫలితానికి అనుసంధానం చేసేవాడు ఒకడు ఉన్నాడని ఒప్పుకోరు. వారు దారి తప్పిపోతున్నారు అని వారికి విషయం తెలియజేయటం కోసం ఈశ్వరుడు అందమైన రూపంలో అక్కడకు వస్తాడు. ఋషులు యజ్ఞాలు చేస్తున్నారు, ఋషుల భార్యలు శివుడి వెనకాల పరుగెడతారు. వారు యజ్ఞాలు చేస్తున్నారు గాని వాళ్ళకు అది నా భార్య అనే ధోరణిపోలేదు. భార్యలు శివుడి వెనకాల పరుగెడుతూ ఉంటే, నాభార్య నాభార్య అంటూ ఋషులు వారి వెనకాల పరుగెడతారు. అంటే నాదిలో నుండే ఇది అంతా వచ్చింది. వేదంలో చెప్పిన కర్మకాండే చేస్తున్నారు గాని వారికి నేను, నాది అనే తలంపులు పోలేదు, అది పోగొట్టటానికే ఈశ్వరుడు ఆ రూపంలో వచ్చాడు. అసలు మనం అంటూలేము, ఉన్నది ఈశ్వరుడే, లోపల అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే. నువ్వు ఉన్నావు అని అనుకొంటున్నావు కాబట్టి అందులో నుండి బయటకు రావటానికే ఈ యజ్ఞాలు, యాగాలు. మన మనస్సును బాగుచేసుకొంటే మనం ఎక్కడ ఉన్నా శాంతిగానే ఉంటాము, మనస్సు బాగాలేకపోతే ఎన్ని భోగాలమధ్యన ఉన్నా వాడికి అశాంతే. భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన మాటను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ ఉంటే ఉన్నది ఆయనే, ఇంకేమీ లేదు అన్న సంగతి మనకు అనుభవంలోనికి వస్తుంది. కబీరు ఒక మాట చెప్పాడు. కొంతమంది శరీరాలు చాలా అందంగా ఉంటాయి, కొంతమంది కుష్టిరోగంతో చర్మం పొలుసులు కింద రేగిపోయి బాధపడుతూ ఉంటారు. ఈ అందమైన శరీరం కలవారు నామం చేయకపోతే, కుష్టి రోగి నామం చేస్తూ ఉంటే ఈ కుష్టి రోగినే మనం గౌరవించాలి, అందమైన శరీరం ఉన్నవాడికంటే వాడే ఉన్నతుడు. ఆ అందమైన శరీరం ఉన్నవాడు భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవ్వడు, ఈ కుష్టిరోగే భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవుతాడు అని కబీర్ చెప్పాడు. అభ్యాసం విషయంలో అజాగ్రత్త పనికిరాదు, బాగా అభ్యాసం చెయ్యాలి. భగవంతుడు మంచి మాటలే చెపుతాడు, మనం బాగుపడే మాటలే చెపుతాడు, ఆయన సత్యమే చెపుతాడు అనే బుద్ధి మనకు ఉంటే ఇతరుల మాటలు మనం పట్టించుకోము లేకపోతే దారినపోయేవాడి మాటలు అన్నీ భుజాన వేసుకొని తిరుగుతాము. నిరంతరం జపం చేయటం వలన ఇతర ఆలోచనలు, ఇతర తలంపులు తగ్గిపోతాయి, పరమేశ్వరుడు ఒకడు ఉన్నాడు అనే భావన స్థిరపడుతుంది.

మనం మాట్లాడే మాట తియ్యగా ఉండాలి. మనమాట ఇతరులకు శాంతి కలుగజేయాలి. ఉన్నది ఒక్కటే. ఆ ఒక్కటే అనేకంగా కనిపిస్తున్నంతకాలం మనకు భయం కలుగుతుంది, ద్వేషం కలుగుతుంది, మృత్యువుకు లోబడతాము. నువ్వు ఒక్కడివి అంటే

ఒక్కడివే. మరి ఈ అనేకత్వం ఎక్కడ నుండి వచ్చింది, ఇది అంతా నీ మాయ. నీ పాదాలను ఆశ్రయిస్తే ఈ మాయలో నుండి బయట పడతాము. ఈ అనేకత్వంలో ఆ ఒక్కటినే చూడగలగాలి. అదే ఇన్ని రూపాలను, ఇన్ని నామాలను ధరించింది. మనం చూసేటప్పుడు గుణాలు వేరువేరుగా ఉంటాయి, రంగులు వేరువేరుగా ఉంటాయి. ఈ దేహాలు నిజంకాదు, మనస్సు నిజంకాదు. పూర్వజన్మలో వారుచేసిన కర్మను బట్టి కొంతమందికి మంచి గుణాలు ఉండవచ్చు, కొంతమందికి చెడ్డ గుణాలు ఉండవచ్చు. ఈ గుణాలు అన్నీ మనస్సులో ఉంటాయి, ఇవి అన్నీ అసత్యమే. కాని వీటి అన్నింటికి ఆధారంగా ఒకడు ఉన్నాడు, వాడే నారాయణుడు, వాడు ఒక్కడే నిజం, నువ్వు ఆయనను చూడు అప్పుడు మనస్సులో వికారాలు రావు, శరీరాల రంగుల యొక్క ప్రభావం నీ మీద పడదు. ఎంతటి నల్లవారిని చూసినా నీకు వికారం రాదు, ఎంత అందమైన వారిని చూసినా నీకు ఆకర్షణ కలుగదు. ఎప్పుడు? అంతర్యామిగా ఉన్న నారాయణుడిని నీవు దర్శించినప్పుడు, అదే నీ కడసారి జన్మ. ఎదుటివారు మనపట్ల ఎలా ఉంటున్నారు అనేది అనవసరం. ఇతరులపట్ల మనం భగవంతుడు చెప్పినట్లుగా ఉంటే సరిపోతుంది. ఇది బాగుపడే వాడి లక్షణం. ఎవరినీ ద్వేషించవద్దు, భగవంతుడు ప్రేమించమని చెప్పాడు కాబట్టి నీవు అందరినీ ప్రేమించాలి, వారు చెడ్డవారైతే భగవంతుడే చూసుకొంటాడు అది మనకు సంబంధం లేదు. ఎందుచేతనంటే మంచి, చెడ్డ మనస్సుకు సంబంధించినవి, రంగు దేహానికి సంబంధించినది, ఆ రెండూ వాడు కాదు, ఇవన్నీ మనం సంకల్పించుకొంటున్నాము. నీ మనస్సు అణిగి ఉంటే, నీ మనస్సు చల్లగా ఉంటే, నీ మనస్సు సంస్కరింపబడితే, నీ మనస్సు రాగద్వేషరహితంగా ఉంటే నీ దేహం కాశీలోను, రామేశ్వరం లోను, అరుణాచలంలోను ఉండనక్కరలేదు, నీ దేహం ఎక్కడ ఉన్నా నీవు పరమశాంతిని అనుభవిస్తావు. నిరంతరం భగవంతుడిని స్మరించేవాడు ఎక్కడ ఉన్నా ఒక్కటే, ఆ స్థలం ముఖ్యం కాదు, ఆ పరిసరాలతో సంబంధం లేని శాంతిని, పరమశాంతిని అనుభవిస్తాడు.

కొంతమందికి నింద వస్తే మొఖం చిన్నది చేసేసుకొంటారు, స్తోత్రం చేస్తే మొఖం పెద్దది చేసేసుకొంటారు. ఈ నిందాస్థుతులను మనం పట్టించుకోకూడదు, వాటిని లోపలకు తీసుకోకూడదు. ఈ రెండూ అబద్ధమే. నిందాస్థుతులతో మనం సంబంధం లేకుండా ఉంటే ఎవరైనా మనలను విమర్శించినా, ఎవరైనా స్తోత్రం చేసినా మనకు వికారం కలుగదు, అటువంటి స్థితిని నీవు పొందాలి, అప్పుడు నీకు జీవన్ముక్తస్థితి కలుగుతుంది. నీ మనస్సులో మినహాయింపులు లేకుండా ఈశ్వరసంకల్పాన్ని గౌరవించటం నేర్చుకొంటే నీకు వ్యక్తిభావన నశిస్తుంది. అంతా ఈశ్వరుడే అనే భావన నీకు కలుగుతుంది. ఉన్నది ఈశ్వరుడే, అంతా ఆయనే అంటున్నారు. అంతా ఈశ్వరుడే అయినప్పుడు మరి నేను ఎవరిని? ఈ నేను అనే

తలంపు ఎందుకు వస్తోంది. ఈ నేను అనే తలంపు మీద నీ పాదం పెట్టు అప్పడు అది అణిగిపోతుంది, అప్పడు అద్వైతానుభవం కలుగుతుంది, ఆ పనిచేసిపెట్టు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. దూడను కట్రాడుకు కట్టివేస్తే ఆ కట్రాడును పట్టుకొని ఎలా ఉంటుందో అలాగ నీ మనస్సు ఏదో దేవుని నామానికి కట్టివేసి జపం చేయిస్తూ ఉంటే అది ఆ నామాన్ని పట్టుకొని ఉంటుంది, అప్పడు దానికి ఇతరతలంపులు, ఇతరఆలోచనలు ఆగిపోతాయి. మనుషులు పుడుతూ ఉంటారు, చనిపోతూ ఉంటారు. ఇదంతా అబద్ధమే, అక్కడ నీ మనస్సును పెడితే ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోతావు. అందుచేత నీ మనస్సును అక్కడ పెట్టవద్దు. దేశకాలములతో సంబంధం లేకుండా, జనన మరణములతో సంబంధం లేకుండా నీ హృదయంలో అంతర్యామిగా బ్రహ్మపదార్థం ఉంది. నీ మనస్సును అక్కడ పెట్టి దానిని జపిస్తూ ఉంటే దానిని ధ్యానిస్తూ ఉంటే నీవు దానిని పొందుతావు. మనం ద్వేషించటం నేర్చుకొన్నాము కాని ప్రేమించటం నేర్చుకోలేదు, ప్రేమించటం నేర్చుకొంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. భగవంతుడికంటే మనం వేరుగా ఉన్నాము, భగవంతుడి సంకల్పానికి భిన్నంగా మనం ప్రవర్తించగలము, మనం ఏదైనా సాధించగలము అని అనుకోవటం వలన మనం పాడైపోతున్నాము. మనకు ఏదైనా మంచి జరిగినా అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి వచ్చింది కాని అది మన తెలివితేటల వలన రాలేదు, మన పొగరుబోతుతనం వలన ఏదో మనం సాధించాము అని మనకు అనిపిస్తుంది. మీకు డబ్బు, అధికారం, అంగబలం ఉండవచ్చు. ఇవి అన్నీ స్వప్న సమానము అని భగవంతుడు చెపుతూ ఉన్నా మనలో ఉన్న అజ్ఞానం వలన అది మనం నమ్మలేకపోతున్నాము. అజ్ఞానికి జాగ్రదవస్థ ఒక్కటే నిజం, జ్ఞానికి మూడు అవస్థలు అబద్ధం. అజ్ఞానికి శాస్త్రం ప్రమాణం కాదు, జాగ్రదవస్థ ప్రమాణం.

మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే పరమశాంతిలో ఓలలాడతారు. వాడు అలా చేసాడు ఏమిటి? వీడు ఇలా చేసాడు ఏమిటి అంటాము. వాడు అలా చేయటానికి భగవంతుడు ఏర్పాటు చేసాడు. నీకెందుకు ఆ గోల? నీకు తెలిసినా, తెలియకపోయినా నీ ముక్కులోగాలి సహజంగా తిరుగుతూ ఉంటుంది, అలాగే నీవు చేసే జపం కూడా సహజం అయ్యే వరకు జపం చేస్తూ ఉండాలి. జపం చేయటం వలన నీకు దుఃఖాన్ని తీసుకొని వచ్చే తలంపులు అన్నీ ఆగిపోతాయి. నీ ప్రయత్నాలతో సంబంధం లేకుండా నీ మనస్సు భగవంతుడి నామాన్ని జపిస్తూ ఉంటే, నీకు తెలియకుండానే నీ మనస్సు నార్మల్‌గా, నేచురల్‌గా జపం చేస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న సహజమైన వస్తువును జపం నీకు పట్టి ఇస్తుంది. ఇదంతా బ్రహ్మ స్వరూపమే, ఇదంతా ఆనంద స్వరూపమే అని నీకు అనుభవంలోనికి రావటానికి బహుజన్మల సాధన వలనగాని, బహుజన్మల పుణ్యబలం ఉంటేగాని అది నీకు

తెలియబడదు అని పరమాత్మ చెప్పాడు. ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించటానికి బహుజన్మల కృషివలన గాని అది నీకు సాధ్యం కాదు. బహుజన్మలు నీవు సాధన చేసి ఉంటే, సత్కర్మ ఆచరించి ఉంటే ఆ పుణ్యఫలితంగా నీ బుద్ధికి పక్వత వస్తుంది, అప్పుడు ఇదంతా వాసుదేవ మయం అని నీకు గోచరిస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు దానికంటే వేరుగా ఏమీ లేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. ఆ అనుభవం రాకపోతే ఏ జన్మకు ఆ జన్మ శరీరం కూడా నీడ వచ్చినట్లుగా అశాంతి, దుఃఖం నిన్ను వెంటాడుతూ ఉంటాయి. మన పుట్టుక మన చేతిలో లేదు, మన చావు మనచేతిలో లేదు కాని మనం బడాయి మాటలు చెపుతాము. ఎందుకు ఆ బడాయి మాటలు, వాటివలన ప్రయోజనం ఏమిటి? ప్రతీమనిషిని గుణాలు ఆడిస్తున్నాయి. ఆ గుణాలలో ఉన్నంతసేపు ఎవడూ ఒడ్డుకు రాలేడు. ఈశ్వరుడి యందు భక్తి లేకుండా, మనం చేసే కర్మలు ఈశ్వరుడికి నైవేద్యం పెట్టకుండా, ఆయన అనుగ్రహం పొందకుండా ఎంతటివాడైనా, ఎన్ని తెలివితేటలు ఉన్నా గుణాలలో నుండి బయటకు రాలేడు. ఇతరులు మనలను ద్వేషిస్తూ ఉంటే ఆ ద్వేషాన్ని మనం తట్టుకొంటున్నామా లేదా, ఆ నైతిక బలం మనకు ఉందా లేదా అని చూడటానికే వారిచేత ద్వేషింపచేస్తాడు. అది మనకు తెలియక వాడిని తిట్టిపోస్తాము. ఇదంతా మాయ. నిన్ను తిట్టేవారిలో కూడా నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు, ఆ చిన్న విషయం అర్థమవ్వటానికి కూడా బహుజన్మల కృషి ఉంటే గాని అది నీకు తెలియదు. మనకు పూజ ఎంత ముఖ్యమో సద్గ్రంథాలను శ్రవణం చేయటం, మననం చేయటం కూడా అంతే ముఖ్యం. అసలు మనలో అజ్ఞానం ఉందనే సంగతి శ్రవణం లేకపోతే తెలియనే తెలియదు. నీ హృదయంలో ఉన్న సత్యం శాంతి పూరితమైనది, జ్ఞానపూరితమైనది, కళ్యాణప్రదమైనది, అది సహజమైనది, అది ఎప్పుడూ ఉండేది దాని తాలుక అనుభవం నీకు కలిగే వరకూ నీవు జపధ్యానములు విడిచిపెట్టవద్దు. నువ్వు లోకానికి సంబంధించిన పనులు చేస్తున్నప్పటికీ నీ మనస్సు అభ్యాసం చేస్తూ ఉండాలి. మన నిజమైన ఇల్లు మన హృదయం. మన నిజమైన ఇంటికి మనం చేరకుండా మనకు ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో, ఏ పాడుబుద్ధి అయితే అడ్డువస్తోందో వాటిని జపధ్యానములు తొలగిస్తాయి. జపధ్యానములు నిన్ను శాంతిమయుడిగా, ఆనందమయుడిగా, పరిపూర్ణుడిగా చేస్తాయి. మీకు శ్వాస ఉన్నంత కాలం విశ్వాసం విడిచిపెట్టవద్దు, శ్రవణ మననములు విడిచిపెట్టవద్దు, జపధ్యానములు విడిచిపెట్టవద్దు. నీవు అలా అభ్యాసం చేయగా చేయగా నీకు లోచూపు కలుగుతుంది. నీకు లోచూపు ఎప్పుడైతే కలిగిందో లోపలఉన్న వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 09 | అయి భీమవరం, షిరిడీ సాయిబాబా ఆలయం |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజభవనం |
| సెప్టెంబర్ | 30 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# సద్గురువు శ్రీ నాన్నగారు

భగవాన్ శ్రీ రమణ మహర్షిచే ఆశీర్వదింపబడి, ఎంపిక చేయబడిన, సద్గురువు శ్రీ నాన్నగారి వలన నేటి సమాజంలో ఒక నవ్యశకం ప్రారంభమైనది. తోటి మానవాళిని స్వరూపంగా ఉన్న సత్యంలోకి మేల్కొలుపుటకు ప్రవచన రూపమైన జ్ఞానయజ్ఞాలకు నాంది పలికి, వాటిని సజీవ నదీ ప్రవాహంలాగ కొనసాగిస్తున్నారు. ఆత్మజ్ఞాన సుసంపన్నులైయుండి, అత్యంత సరళంగా జీవిస్తూ, మానవాళిని పట్టి పీడిస్తున్న భ్రాంతిరూపమైన అజ్ఞానము నుండి విడుదల పొందుట ద్వారా స్వస్వరూప ఎరుకలోకి మేల్కొనుటకు వారి దివ్యబోధను అందిస్తున్నారు. శ్రీనాన్నగారు తమ వాక్కుచేత, నిర్మల ప్రేమచేత, మనలను పునీతులను చేస్తూ, మనలోని వ్యక్తిభావనను తొలగించడంపై వారి దృష్టిని కేంద్రీకరిస్తారు. భగవాన్ శ్రీ రమణమహర్షి బోధాసారాన్ని అత్యంత సులభరీతిలో వారి జ్ఞాన ప్రవచనాల ద్వారా మరియు 'రమణ భాస్కర' మాసపత్రిక ద్వారాను అందిస్తూ, సాధకులకు గొప్ప మార్గదర్శియై జీవించే కళను నేర్పుతూ, సుఖ శాంతులను అందిస్తున్నారు. "దేహం జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందుట ద్వారా అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవడమే ఈ మానవ జీవిత గమ్యం" - అన్న శ్రీ నాన్నగారి బోధాసారాన్ని అనుభవైకవేద్యం చేసుకొనుట ద్వారా మాత్రమే గురుఋణం తీర్చుకోగలము.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# గురువు అంటే - నడుస్తున్న దైవం

భగవంతుడు తన కృపను మానవుల మీద సద్గురువు ద్వారానే చూపుతాడు. ఆయనే మానవాకారంలో మన మధ్య పుట్టి మనలోని భగవత్ భక్తిని ప్రేరేపించి తన చెంతకు పిలుచుకొంటాడు. సద్గురువుతో అనుబంధం ఏర్పడిన తరువాత శిష్యుడు అతనితో విముఖుడైనా గురువు మాత్రం అతన్ని వదలడు. అతని నిస్వార్థ ప్రేమకు సాటియైనది ఈ లోకంలో మరొకటి లేదు. సద్గురువునందు ప్రేమ కుదిరితే జపతపాలు, తీర్థయాత్రలు, వేదశాస్త్రపఠనాలు మొదలుగా గలవన్నీ ఆయన ప్రేమ ముందు తలవాల్చవలసిందే. దానికి సమానమైనది ఏదీ లేదు. గురుప్రేమ లభించిననాడు నోరు మూతపడుతుంది. బాహ్య నేత్రాలు మూసుకొనిపోతాయి. మనస్సు శాంతిలో నిశ్చలమౌతుంది. దృష్టి గురుపాదాలలో లీనమౌతుంది కాని ఆ ప్రేమ రంగు అద్దటానికి హృదయమనే వస్త్రం పరిశుభ్రంగా ఉండాలి. తెలివిలేని పిల్లలను తల్లికోడి ఏవిధంగా తన రెక్కల క్రింద రక్షిస్తుందో అదేవిధంగా సద్గురువు తన నియంత్రణలో నడుచుకొనే వారి పూర్తి బాధ్యతను వహిస్తాడు. చిన్న చిన్న పొరపాట్లను కూడా అప్పటికప్పుడే ఎత్తి చూపి వాటిని సరిదిద్దుతాడు. అహంకారాన్ని పెరగనివ్వడు. గర్వాన్ని అణచటానికి ఒక్కొక్కసారి నిర్దాక్షిణ్యంగా వ్యవహరించవచ్చు. నేటి మిత్రులు రేపటి శత్రువుగా వ్యవహరించవచ్చును. గురువు ఒక్కడే నమ్మదగినవాడు. మనం తాళం పోగొట్టుకొంటే తాళం తీసేవాని దగ్గరకు వెళతాము. బంధనాల రూపమైన రాగద్వేషాలనే తాళం విప్పాలంటే గురువు చేతిలో ఉన్న తాళం చెవికోసం ఆయనను ప్రాధేయపడాలి. సుడిగాలి వైపుకు దుమ్ము ఏవిధంగా లాగుతుందో అలాగే మహాత్ములు ఎక్కడికి వెళ్ళినా భక్తులు వారి చుట్టూ చేరుతారు. వారి శ్వాసే కాక వారి శరీరంపై వీచే గాలి కూడా లోకానికి మేలు చేస్తుంది అంటారు పెద్దలు. "సద్గురువు జీవన సరళిని అతని మనోబుద్ధులతో చేసే కర్మలను గాని మనం అంచనా వెయ్యలేము. పర్వతాన్ని వర్ణించబోయి అందులో చిన్న రాయిని వర్ణించటం లాంటిది. జ్ఞాని గురించి మనం ఏమి చెప్పకొన్నా అంతా అబద్ధమే అవుతుంది" అన్నారు కబీర్. జ్ఞానికి సంతోష విచారాలు, రక్తి, విరక్తి, ముక్తి కోసం కోరికా ఏదీ ఉండదు. అతడు ఏదీ కాదు. అన్నీ అతడే.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం